

శతాబ్ది వేడుకలకు ముస్తాబు

నల్లగొండలోని ఆర్యసమాజ్ ఏర్పాటు చేసి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శతాబ్ది ఉత్సవాలకు ముస్తాబైంది.

- 8లో



అన్నను హత్యచేసిన తమ్ముడు

ఇల్లు మరమ్మతుల విషయంలో అన్నదమ్ముల మధ్య తలెత్తిన వివాదంలో తమ్ముడు అన్నను హతమార్చాడు.

- 8లో



నిత్యకల్యాణం పునరుద్ధరణ

యాదాద్రి పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నిత్య కల్యాణ వేడుకను పునఃప్రారంభించారు.

- 8లో

న్యూస్‌రీల్

ఎన్నికల శిక్షణకు వెళ్లిన కలెక్టర్



నల్లగొండ : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి రెండు రోజుల శిక్షణ కోసం నల్లగొండ కలెక్టర్ హరిచందన ఢిల్లీకి వెళ్లారు. రెండు రోజులు ఆమె ఢిల్లీలో ఉండనున్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాసులు, ఆర్డీఓలు కూడా పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన విధులపై శిక్షణ కోసం వెళ్లారు. వారు నాలుగు రోజులపాటు హైదరాబాద్‌లో ఉండనున్నారు.

గ్రీవెన్స్‌డేలో దరఖాస్తుల స్వీకరణ



దివ్యాంగుడికి మూడు చక్రాల బండి అందిస్తున్న అధికారులు

నల్లగొండ : గ్రీవెన్స్‌డే సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో వివిధ సమస్యలపై ప్రజలను డీఈఓ భిక్షపతి, హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులు స్వీకరించి వాటి పరిష్కారం కోసం సంబంధింత శాఖలకు పంపారు. ఈ సందర్భంగా కట్టంగూర్ మండలానికి చెందిన దివ్యాంగుడు ఏర్పుల వెంకన్న మూడు చక్రల వాహనానికి దరఖాస్తు చేసుకోగా అతనిడి వెంటనే అందజేశారు.

1వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

నల్లగొండ : ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను వచ్చే నెల 1వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్ సోమవారం ఒక ప్రకటనలు తెలిపారు. అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు, యువత, ప్రజలలో ఆర్థిక అంశాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. 'చేయండి సరైన ఆరంభం.. అవ్వండి ఫైనాన్షియల్లి స్మార్ట్' అనే అంశంపై వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు నల్లగొండలోని క్లాక్ టవర్ సెంటర్ నుంచి నుంచి 2కే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రన్‌లో జిల్లా అధికారులు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రింగు, అలవి వలలు నిషేధిస్తూ తీర్మానం



మత్స్యకారుల సంఘాల నాయకులు

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ జలాశయంలో రింగు, అలవి వలలను నిషేధిస్తూ మత్స్యకార సంఘాల నాయకులు సోమవారం తీర్మానం చేశారు. పైలాన్‌కాలనీలోని మత్స్యకారుల కమ్యూనిటీ హాల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో నాగార్జునసాగర్ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ అలవి, రింగు వలలు వినియోగించి జలాశయంలో ఉన్న చిన్న చేపలను పట్టడం వల్ల రెండుమూడేళ్ల పాటు మత్స్యకారులకు ఉపాధి కల్పించే చేపలు నెలలోనే అయిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందరం కలిసి తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాలని కోరారు. సమావేశంలో రైట్ బ్యాంకు (ఆంధ్రా) అధ్యక్షుడు కారే ముసలాయి, నరేష్, మురళి, బంగారు, మురళి, రవి, తాతారావు, విజయ్, పుష్పాటి శివ, అప్పారావు, నాగరాజు, దేవుడు, రమణ, శ్రీను, కోదండం తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు చేపట్టారు. శివుడికి ఇష్టమైన రుద్రాభిషేకం, బిల్వార్చన తదితర కైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక నృసింహుడి ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున శ్రీస్వామి, అమ్మవారికి సుప్రభాతం, అభిషేకం, అర్చనలు చేశారు.అనంతరం ఆలయ ముఖ మండపం, ప్రథమ ప్రాకార మండపంలో నిత్యకల్యాణం, శ్రీసుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు నిర్వహించారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

ధరణి కష్టాలు తీరేలా..

ఆర్డీఓ, తహసీల్దార్లకు కూడా 'లాగిన్'

- ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన
- నిషేధిత జాబితాలో పడిన సర్వే నంబర్లపై ప్రత్యేక దృష్టి
- జిల్లాలో 23,145 దరఖాస్తులు పెండింగ్
- భూ సమస్యలకు మోక్షం కలిగేలా కార్యాచరణ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ధరణి సమస్యలు ఎట్టకేలకు కొలిక్కి రాబోతున్నాయి. వీటి పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. గతంలో మాదిరిగా కలెక్టర్ స్థాయిలో కాకుండా తహసీల్దార్లు, ఆర్డీఓలకు కూడా పరిష్కరించే బాధ్యతలు అప్పగించేలా ఆలోచన చేస్తోంది. విధి విధానాలు అమల్లోకి వస్తే మండల స్థాయిలోనే భూ సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంది. మండల స్థాయిలో పరిష్కారమయ్యే వాటిని తహసీల్దార్ వద్దనే చేసేలా, అక్కడ కానివి ఆర్డీఓకు పంపేలా.. అక్కడా పరిష్కారం కానివి కలెక్టర్‌కు పంపించేలా ఆలోచనలు చేస్తోంది. ఈ పద్ధతి అమల్లోకి వస్తే ధరణి భూ సమస్యలకు పరిష్కారం లభించనుంది.

ఆప్షన్లు లేకపోవడం వల్లే..

ధరణి పోర్టల్ తీసుకొచ్చినప్పుడు అన్ని సర్వే నంబర్లను పాస్‌బుక్‌ల ఆధారంగా ఆన్‌లైన్ చేశారు. పాస్‌బుక్‌లు లేని వాటిని పెండింగ్‌లో పెట్టారు. ప్రభుత్వ, వక్ఫ్, కాల్వలు, దేవాదాయ ఇతర గ్రామ పంచాయతీ భూములన్నింటినీ నిషేధిత జాబితాలో ఉంచారు. అయితే ఒక సర్వే నంబరులో ప్రభుత్వ భూమి ఉండి అదే సర్వే నంబర్‌లో ప్రైవేట్ భూమిలో ఉన్నా ఆ సర్వే నంబర్ మొత్తం నిషేధిత జాబితాలోకి వెళ్లిపోయింది. దీంతో సదరు యజమానులు వాటిని క్రయవిక్రయాలు చేసుకోవడానికి, బ్యాంకు రుణాలు పొందడానికి అవకాశం లేకుండా పోయింది. నిషేధిత జాబితాలో పడిన సర్వే నంబర్ల వారికి పాస్‌బుక్‌లను ఇవ్వలేదు. దీంతో ఆ రైతులంగా రైతుబంధు, రైతు బీమాకు దూరమయ్యారు.

వివరాలు తప్పుగా నమోదు..

రికార్డులను కంప్యూటరైజ్ చేసే పనులను అప్పట్లో ప్రైవేట్ వారికి అప్పగించారు. త్వరగా కావాలని ఒత్తిడి చేయడంతో చాలాచోట్ల ఆపరేటర్లు వివరాలను తప్పుగా నమోదు చేశారు. మరోవైపు గతంలో భూములు కొనుగోలు చేసిన వారు రిజిస్ట్రేషన్ చేసుకోకపోవడంతో పాత వారి పేరునే కొత్త రికార్డుల్లో నమోదు చేసి పాస్‌బుక్‌లు జారీ చేశారు. దీంతో సదరు భూమి కొనుగోలు చేసి స్వాధీనంలో ఉన్నా.. పాస్‌బుక్‌లు మాత్రం పాత యజమానుల పేరుపైనే ఉన్నాయి. వాటిని పరిష్కరించేందుకు ఆప్షన్ లేకుండా పోయింది. వాటిని పరిశీలించి న్యాయంగా పాస్‌బుక్‌లు రద్దు చేసే అధికారం కలెక్టర్‌కు లేకపోవడంతో అవన్నీ పెండింగ్‌లో పడ్డాయి. టీఎం 33 అనే ఆప్షన్ పెట్టి చాలా వరకు సమస్యలు పరిష్కరించినప్పటికీ ఇంకా జిల్లాలో 23,145 దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటి పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

తక్కువ, ఎక్కువ నమోదు..

ధరణిలో తప్పుల కారణంగా ఒక సర్వే నంబర్‌లో ఒక వ్యక్తి పేరున ఉన్న భూమి అంతా అతని పేరుమీద నమోదు కాలేదు. ఎక్కువ, తక్కువగా నమోదైంది. మరికొన్నింటికి ఒకరి పేరుకు బదులు మరొకరి పేరు నమోదైంది. గతంలో చాలాచోట్ల తెల్ల కాగితాల్లో రాసుకొని (సాదాబైనామా) క్రయవిక్రయాలు జరిపారు. ఆ తరువాత వాటిని రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. ఇలాంటివి అనేకం ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. మరోవైపు అమ్మినవారు చనిపోవడం, వారి పిల్లలు ప్రస్తుతం భూమి మీదకు వచ్చి పంచాయతీలు చేయడం వంటి సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. ఆయా భూములకు సంబంధించిన రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎదురుచూస్తున్నారు.

యువత ఆకాంక్షలు నెరవేరుస్తాం



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తాం
- ఉద్యోగాలు సృష్టించేలా యువత తయారు కావాలి
- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఎంజీయూలో జాబ్‌మేళా ప్రారంభం



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

ఎంజీయూ (నల్లగొండ రూరల్) : నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించి వారి ఆకాంక్షలు నెరవేరుసామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో నిర్వహించిన జాబ్‌మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమగ్ర అభివృద్ధికి విద్య పునాది లాంటిదని, విద్య మాత్రమే సవాళ్లను ఎదుర్కొనే శక్తిని ఇస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగాలు కల్పించేందుకు 127 కంపెనీలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇప్పటికే ఉస్మానియాలో జాబ్‌మేళా నిర్వహించి 18 వేల మందికి, జేఎన్‌టీయూలో నిర్వహించి 10 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొద్దిరోజుల్లో 13 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామన్నారు. సాధ్యమైనంత త్వరగా అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. ఎంజీయూలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాతో 13 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. మరో నెల రోజుల్లో ఎన్జీ కాలేజీలో ఉద్యోగ మేళా నిర్వహిస్తామని తెలిపారు. యువత ఉద్యోగాలు ఇచ్చేలా తయారు కావాలని, తన కూతురు కూడా ఉద్యోగంలో చేరిన తర్వాత మరికొంత మందికి ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. ఈ సందర్భంగా దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం రచించిన వింగ్స్ ఆఫ్ ఫైర్ పుస్తకంలోని అంశాలను ప్రస్తావించారు. ఉద్యోగాలు సాధించేందుకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా శిక్షణ, మెటీరియల్ అందించి అండగా ఉంటామన్నారు. తాను ఆనాటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డిని ఒప్పించి యూనివర్సిటీని ఏర్పాటు చేయించానని చెప్పారు. అంతకుముందు యూనివర్సిటీలో పరీక్షల విభాగం, క్రీడా కాంప్లెక్స్, హంపీ థియేటర్, ఇంజనీరింగ్ నూతన భవనాలను మంత్రి ప్రారంభించారు. ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. టాస్క్ ఈసీఓ శ్రీకాంత్ సిన్హా మాట్లాడుతూ మెగాజాబ్ మేళా ద్వారా ఉద్యోగాలు కల్పించేందుకు కంపెనీలు భారీగా ముందుకు వచ్చాయన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ రవి, సీఈఓ సత్యనారాయణ, గోనారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ప్రశాంత్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

రైల్వే స్టేషన్ల అభివృద్ధికి శ్రీకారం





వర్చువల్‌గా మాట్లాడుతున్న ప్రధాని మోదీ, నల్లగొండలో ప్రధాని ప్రసంగాన్ని వీక్షిస్తున్న నాయకులు

- అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద నల్లగొండ, మిర్యాలగూడ రైల్వే స్టేషన్లు ఎంపిక
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ

నల్లగొండ రూరల్, మిర్యాలగూడ అర్బన్ : అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ రైల్వేస్టేషన్లలో చేపట్టనున్న ఆధునికీకరణ పనులకు సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ రెండు స్టేషన్ల అభివృద్ధికి రూ.9.50 కోట్ల చొప్పున కేటాయించారు. ఈ నిధులతో ఆధునిక ఫ్లాట్ ఫామ్‌లు, వెయిటింగ్ హాల్‌లో వసతులు, ముఖ ద్వారాల అభివృద్ధి, పార్కింగ్, ఆధునాత పబ్లిక్ అనౌన్స్‌మెంట్ విధానం, ఎత్తయిన ప్లాట్‌ఫామ్‌లు, ప్లాట్‌ఫాం షెల్టర్ల నిర్మాణం చేపడతామన్నారు. ఒకస్టేషన్ ఒక ఉత్పత్తి పథకం కోసం స్టాళ్లను, ఎల్‌ఈడీతో స్టేషన్ పేర్లు గల బోర్డులు రూపొందించనున్నారు. ఈ సందర్భంగా ఆయా రైల్వే స్టేషన్లలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాని ప్రసంగాన్ని వీక్షించేందుకు ప్రత్యేకంగా స్క్రీన్లను ఏర్పాటు చేశారు. నల్లగొండలో నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, సీడీఎస్ ప్రదీప్, పీడబ్ల్యూఐ రాంభద్రారావు, స్టేషన్‌మాస్టర్ సుధాకర్‌బాబు, సాయిరాం, మిర్యాలగూడలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, బీజేపీ నాయకులు సాదినేని శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో ప్రధాని ప్రసంగాన్ని వింటున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

సీఎంను కలిసిన పెన్షనర్లు

నల్లగొండ : సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో పెన్షనర్ల సంఘం ప్రతినిధులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయయను శాలువాతో సత్కరించి సంఘం డైరీని అందజేశారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని, హెల్త్ స్కీమ్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు సి.చంద్రశేఖర్, జి.దామోదర్‌రెడ్డి, విశ్వనాథం, పి.శరత్‌బాబు, పి.పెంటయ్య, జి.వెంకట్‌రెడ్డి, ఇందర్ సింగ్, అంజయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

నల్లగొండ : ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షల కోసం 50 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. పరీక్షల సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. నిమిషం నిబంధనను కచ్చితంగా అమలు చేస్తామని.. విద్యార్థులు గంటల ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని డీఐఈఓ దస్రూనాయక్ సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా (9848309004, 7730860961) ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి విజయసంకల్ప యాత్ర

- జిల్లాలో మూడు రోజులు సాగనున్న యాత్ర



సభ నిర్వహణకు నల్లగొండలోని క్లాక్ టవర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్: బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా క్లస్టర్ల వారీగా చేపట్టిన విజయసంకల్ప యాత్ర ఈ నెల 28 నుంచి మూడు రోజులు పాటు జిల్లాలో సాగనుంది. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా బీజేపీ నాయకత్వం విజయసంకల్ప యాత్ర నిర్వహిస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రారంభమైన కృష్ణమ్మ క్లస్టర్ విజయ సంకల్ప యాత్ర 28న దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గంలోని డిండికి రానుంది. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో యాత్ర కొనసాగనుంది. మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సభల నిర్వహణకు జిల్లా నాయకత్వం కసరత్తు చేస్తోంది. 28న దేవరకొండ పట్టణంలో కార్నర్ మీటింగ్‌లో ఏర్పాటు చేస్తున్నారు. దీనికి మాజీ మంత్రి ఈటల రాజేందర్, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పాల్గొననున్నారు. అదేరోజు సాయంత్రం నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియాలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. 29న ఉదయం మిర్యాలగూడలో కార్నర్ మీటింగ్, హుజూర్‌నగర్ సభ నిర్వహించనున్నారు. అదే విధంగా మార్చి 1న కోదాడ, సూర్యాపేట, తిప్పర్తిలో యాత్ర సాగనుంది. అదే రోజు సాయంత్రం నల్లగొండలోని పెద్ద గడియారం సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతుంది. పది వేల మందిని సమీకరించేందుకు జిల్లా నాయకత్వం కసరత్తు చేస్తోంది. ఈ సభకు అస్సాం సీఎంను ముఖ్యఅతిథిగా తీసుకురావాలని నాయకులు భావిస్తున్నారు.



రైతులకు మద్దతుగా..

ఢిల్లీలో రైతుల ఆందోళనకు మద్దతుగా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

అధికారుల్లో బదిలీల గుబులు

- ఎన్నికల సంఘం ఆదేశాలతో తప్పని స్థానచలనం
- గతంలో జిల్లా యూనిట్‌గా.. ఈ సారి పార్లమెంట్ నియోజకవర్గం యూనిట్‌గా



నల్లగొండ : అధికారుల్లో బదిలీల గుబులు మొదలైంది. పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్నందున ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యూనిట్‌గా తీసుకుని ఒకేచోట మూడు సంవత్సరాలు పనిచేసిన ఉద్యోగులతో పాటు సొంత జిల్లాలో పనిచేసే వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. కానీ పార్లమెంట్ నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించడంతో ఇటీవలే ఇతర జిల్లాలకు బదిలీ అయిన వారికి.. మళ్లీ స్థానచలనం తప్పడం లేదు.

గతంలో పక్కనే ఉన్న జిల్లాలకు..

గతంలో జిల్లాను యూనిట్‌గా తీసుకుని బదిలీలు చేయడంతో జిల్లాలోని డీపీఓ, డీఆర్‌డీఓ, సీపీఓ, ఎంపీడీఓ, తహసీల్దార్లు, పోలీస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులను బదిలీ చేశారు. గతంలో నల్లగొండ జిల్లాలో మూడేళ్లు పనిచేసినా, సొంత జిల్లా అయి ఉన్న అధికారులంతా సూర్యాపేట, యాదాద్రి జిల్లాలకు బదిలీ అయ్యారు. ఆ జిల్లాల్లో పని చేసిన అధికారులు ఈ జిల్లాకు వచ్చారు. ఇప్పుడు పార్లమెంట్ నియోజకర్గం పరిధి యూనిట్‌గా తీసుకుని బదిలీలు చేస్తే వారంతా వేరే జిల్లాలకు వెళ్లాల్సిందే.

ఉమ్మడి జిల్లా దాటాల్సిందే..

ఒక జిల్లా అధికారి అసెంబ్లీ ఎన్నికల సమయంలో నల్లగొండ జిల్లాలో పనిచేసి ఉండి.. ఇటీవల యాదాద్రి జిల్లాకు బదిలీ అయ్యాడు. ఇప్పుడు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం .. యాదాద్రి జిల్లాకు సంబంధించి భువనగిరి పార్లమెంట్ పరిధిలోకి నల్లగొండ జిల్లాలోని నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాలు వస్తాయి. దీంతో ఆ అధికారి వేరే జిల్లాలకు బదిలీ అవుతారు. ఇలాగే నల్లగొండ నుంచి సూర్యాపేట జిల్లాకు బదిలీ అయినా.. సూర్యాపేట నల్లగొండ పార్లమెంట్ పరిధిలోకి వస్తున్నందున వారికి స్థాన చలనం తప్పదు. ఇలా.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి జిల్లాల్లో పనిచేసిన తప్పకుండా ఉమ్మడి జిల్లాలను వదలి వెళ్లాల్సి వస్తుంది.

మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తాం

చండూరు: మానవ హక్కుల ఉల్లంఘన, సమాజంలో జరిగే అవినీతిపై పోరాడుతూనే మూఢనమ్మకాలపై నిత్యం ప్రజలకు అవగాహన కల్పిస్తామని నేషనల్ ఫోరం ఫర్ పీపుల్స్ ఎంపవర్‌మెంట్ అండ్ సోషల్ జస్టిస్ ఫోరం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కంచర్ల నిశాంత్ సాగర్, బొమ్మరగోని కిరణ్ అన్నారు. చండూరులో ఫోరం కార్యాలయాన్ని సోమవారం వారు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తమ ఫోరం న్యాయ చట్టాలపై అవగాహన కల్పిస్తూ.. ప్రజలను చైతన్యం చేస్తుందని తెలిపారు. విద్యార్థినులకు మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తూ, మహిళల అభ్యున్నతి కోసం తమ సంస్థ పాటుపడుతోందన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ప్రకటించారు. నల్లగొండ జిల్లా కన్వీనర్‌గా అబ్బిడి రఘుమారెడ్డి, కో కన్వీనర్‌గా మండల నాగరాజు, కమిటీ సభ్యులుగా మారుతి, శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్ శ్రీకాంత్, సైదులు, నవీన్, శివ, శివకుమార్, బాలు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం జరగాలి



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ చందనా దీప్తి



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ చందనాదీప్తి

- ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ క్రైం : బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పని చేయాలని ఎస్పీ చందనా దీప్తి ఆదేశించారు. పోలీస్ గ్రీవెన్స్‌డేలో భాగంగా సోమవారం ఆమె జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల వినతులు స్వీకరించి మాట్లాడారు. 40 మంది అర్జీదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితుల పూర్తి వివరాలు తనకు ఇవ్వాలని ఆదేశించారు. భూ సమస్యలు, భార్యాభర్తల మధ్య విభేదాలు, ఫైనాన్స్ సమస్యలపైన ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

చిట్యాల : విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రీడా పోటీల్లో రాణించాలని ఎస్పీ చందనాదీప్తి పేర్కొన్నారు. చిట్యాల పట్టణంలోని గ్రీన్ గ్రోవ్ స్కూల్‌లో స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.సైదాబాబు, పాఠశాల చైర్మన్ బండి వీణా అనిల్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, జి.మురళి, ఏఓ పోలా గోవర్ధన్, తిరుమలేష్, అభినవ్, ధర్మేంద్ర, కోటి, జూలి ఉన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ మృతి

కోదాడరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలం దొండపాడుకు చెందిన మెట్ట వెంకటప్పరెడ్డి(51) ఈ నెల 15వ తేదీన ద్విచక్ర వాహనంపై కోదాడకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కోదాడ మండలంలోని కాపుగల్లు క్రాస్‌రోడ్డు వద్ద మేళ్లచెర్వు వైపు నుంచి ఎదురుగా వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వెంకటప్పరెడ్డిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

రామన్నపేట: మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. రామన్నపేట ఎస్ఐ పి. మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సిరిపురం గ్రామానికి చెందిన బల్గూరి లావణ్య ఈ నెల 24న పాలిటెక్నిక్ ప్రాక్టికల్ ఎగ్జామ్స్‌కు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయల్దేరింది. సాయంత్రం అయినా ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తమ బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికారు. ఎంత వెతికినా ఆచూకీ లభ్యంకాకపోవడంతో లావణ్య తల్లి క్రిష్ణవేణి సోమవారం రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. యువతి ఆచూకి తెలిసిన వారు 87126 62487 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

యాదాద్రిలో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పూజలు


కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

యాదగిరిగుట్ట: యాదాద్రీశుడిని నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్‌కుమార్ సోమవారం కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయాధికారి వెంకటేష్ లడ్డూ ప్రసాదం అందజేశారు.

నిత్యకల్యాణం పునరుద్ధరణ

యాదగిరిగుట్ట: యాదాద్రి పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి, అమ్మవారి కల్యాణ వేడుకను పునఃప్రారంభించారు. ఈ నెల 19నుంచి 25వ తేదీ వరకు ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు జరగడంతో నిత్యకల్యాణాన్ని రద్దు చేశారు. బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగియడంతో సోమవారం నుంచి ఆగమ శాస్త్రం ప్రకారం పునరుద్ధరించారు.ఈ వేడుకలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

శతాబ్ది వేడుకలకు ముస్తాబు

- నల్లగొండలో ఆర్యసమాజ్ ఏర్పాటు చేసి వందేళ్లు పూర్తి
- మూడు రోజుల పాటు మహాసభల నిర్వహణ
- హాజరుకానున్న స్వామి రామ్‌దేవ్ బాబా, స్వామి ప్రణవానంద సరస్వతి, స్వామి ఆర్యవేశ్


నల్లగొండ పట్టణంలోని ఆర్యసమాజ్ మందిరం


మహాయజ్ఞం నిర్వహించేందుకు సిద్ధం చేసిన యజ్ఞశాల

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలో ఆర్యసమాజ్ ఏర్పాటు చేసి వందేళ్లు పూర్తైన సందర్భంగా మార్చి 1, 2, 3 తేదీల్లో ఆర్యసమాజం వ్యవస్థాపకుడు దయానంద సరస్వతి ద్విశత జన్మ జయంతి మహాసభలు నిర్వహించనున్నారు. ఈ మహాసభలకు స్వామి రామ్‌దేవ్ బాబా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అదేవిధంగా స్వామి ప్రణవానంద సరస్వతి, స్వామి అగ్నివేశ్, ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు సత్యనారాయణ తదితరులు పాల్గొననున్నారు. మార్చి 1వ తేదీన 200 యజ్ఞకుండాలతో నల్లగొండ పట్టణంలోని రామగిరిలో గల ఆర్యసమాజ్ మందిరంలో మహా యజ్ఞాన్ని నిర్వహించనున్నారు.

ఆర్యసమాజం స్థాపించి వందేళ్లు..

నల్లగొండ పట్టణంలో 1924లో ఆర్యసమాజాన్ని షేర్ బంగ్లాలో ప్రారంభించారు. కమ్యూనిస్టు యోధుడు ధర్మభిక్షం ఆర్యసమాజ్ బాధ్యులుగా కొనసాగారు. కొమ్రరాజు కోటేశ్వరరావు నల్లగొండలో ఆర్యసమాజాన్ని నడిపించడంలో కీలకపాత్ర పోషించారు. నల్లగొండ వాస్తవ్యుడు బలిజ బొంతయ్యను హరిద్వార్ పంపి సంస్కృతం, వేదాలు చదివించి పండిత భద్రదేవ్‌గా నల్లగొండలో ఆర్యసమాజ్ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. 1922లో ఆర్యసమాజ్‌లో గ్రంథాలయం స్థాపించారు. అక్కడ ఆడపిల్లలకు స్కూల్ నడిచేది. వారికి చదువుతో పాటు కర్రసాము, కత్తిసాము కూడా నేర్పేవారు. 1938లో ఆలిండియా ఆర్యసమాజ్ మీటింగ్ నల్లగొండలో పెద్దఎత్తున నిర్వహించారు. 1965లో బాలికల పాఠశాల కోసం చందాలు సేకరించి గదులు కట్టించారు. మొదట కట్టిన గదులను గవర్నమెంట్ బాలుర హైస్కూల్‌కి ఇచ్చారు. తర్వాత కట్టినవి గవర్నమెంట్ బాలికల హైస్కూల్‌కి ఇచ్చారు. నల్లగొండ పట్టణానికి చెందిన దివంగత దోమలపల్లి యాదగిరిరావు రామగిరిలో ఆర్యసమాజ్ మందిరం నిర్మాణం కోసం భూమిని దానం చేశారు. అదే భూమిలో వెంకటనారాయణ గారు ప్రెసిడెంట్‌గా ఉండగా ఆర్యసమాజ్ మందిరం నిర్మితమైనది. అక్కడ పెళ్లిళ్లు, ఉపనయనాలు, సమావేశాలు నిర్వహించేవారు. ఆ తర్వాత పేద పిల్లలకు 5వ తరగతి దాకా పాఠశాల, కరాటే, వారం వారం యజ్ఞం, సమావేశాలు జరిగేవి. నల్లగొండలో ప్రతి దసరాకు షేర్ బంగ్లా ఆర్యసమాజం నుంచి రామగిరి ఆర్యసమాజ్ మందిరం దాకా ఒక నగర ప్రముఖుడిని గుర్రంపై ఆసీనులు చేయించి శోభాయాత్ర నిర్వహిస్తారు.


నల్లగొండ పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మూడు రోజుల పాటు వేడుకలు



మార్చి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఆర్యసమాజ్ శతాబ్ది వేడుకలు జరుగుతాయి. మొదటి రోజు మహాయజ్ఞం, రెండో మహాసభలు ప్రారంభంకానున్నాయి. మూడో రోజు ఉదయం 9 గంటలకు ముగింపు కార్యక్రమం ఉంటుంది. ఈ వేడుకల్లో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొంటారు.

– బోయినపల్లి కృష్ణారెడ్డి, ఆర్యసమాజ్ అధ్యక్షుడు, నల్లగొండ

ప్రముఖులు హాజరవుతారు



ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా స్వామి రాందేవ్ బాబా హాజరవుతారు. ఆర్య సమాజం వ్యవస్థాపకుడు దయానంద సరస్వతి ద్విశత జన్మ జయంతి వేడుకలను కూడా నిర్వహిస్తున్నాం. మహాసభల ప్రారంభం రోజున 200 యజ్ఞ కుండాలతో మహాయజ్ఞం నిర్వహిస్తున్నాం. ఈ వేడుకలకు దేశంలోని చాలామంది ప్రముఖులు హాజరవుతారు.

– హరికిషన్ వేదాలంకర్, ఆర్య ప్రతినిధిసభ ఏపీ, తెలంగాణ సెక్రటరీ

పెట్రోల్ పోసి బైక్‌కు నిప్పంటించిన దుండగులు

భువనగిరి క్రైమ్: ఇంటి పక్కన పార్కింగ్ చేసిన బైక్‌పై గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ ఘటన భువనగిరి మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు.. తాజ్‌పూర్ గ్రామానికి చెందిన గుండ్లపల్లి ప్రవీణ్‌గౌడ్ తన బైక్‌ను ఆదివారం రాత్రి తన ఇంటి పక్కన పార్కింగ్ చేయగా.. అర్ధరాత్రి సమయంలో బైక్ మంటల్లో కాలిపోతుండడం గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే ప్రవీణ్ గౌడ్‌కు చెప్పారు. అతడు ఇంట్లో నుంచి వచ్చి చూసేసరికి బైక్ కాలిబూడిదయ్యింది. కొందరు కావాలనే పెట్రోల్ పోసి తన బైక్‌ను తగలబెట్టారని బాధితుడు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు.


కాలిపోయిన బైక్

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి


స్వాతి మృతదేహం

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన యువతి సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్బన్ కాలనీకి బనగాని కుమార్, బాలలక్ష్మి దంపతుల కుమార్తె స్వాతి(21) డిగ్రీ పూర్తిచేసింది. కుమార్ స్థానికంగా ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తుండగా.. బాలలక్ష్మి ఇళ్లల్లో పనిచేస్తోంది. సోమవారం సాయంత్రం బాలలక్ష్మి ఇళ్లల్లో పనులు ముగించుకొని ఇంటికి వచ్చేసరికి స్వాతి విగతజీవిగా కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. తన కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నట్లు మృతురాలి తల్లి బాలలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

కారు ఢీకొని వృద్ధురాలు దుర్మరణం

చివ్వెంల(సూర్యాపేట): వృద్ధురాలు రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో ఆమె మృతి చెందింది. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామ స్టేజీ వద్ద సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దురాజ్‌పల్లి గ్రామానికి చెందిన పానుగోటి రుక్కమ్మ(60) సోమవారం గ్రామ పరిధిలోని విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి దాటుతుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రుక్కమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కుమార్తె మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి. వెంకట్‌రెడ్డి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ హస్పిటల్‌కు తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొట్టిన లారీ.. వ్యక్తి మృతి


స్వామి (ఫైల్)

వలిగొండ: టీవీఎస్ మోపెడ్‌ను లారీ ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన వలిగొండ మండల కేంద్రంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలంలోని వెల్వర్తి గ్రామానికి చెందిన మంత్రి స్వామి(59) కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం పని నిమిత్తం స్వామి తన టీవీఎస్ మోపెడ్‌పై వలిగొండకు వచ్చాడు. ఈ క్రమంలో వలిగొండ పట్టణ కేంద్రంలో అతివేగంగా వచ్చిన లారీ టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన స్వామి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ లాల్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.2లక్షల నగదు, బంగారు ఆభరణాలు, వెండి గొలుసులు అపహరణ

కట్టంగూర్: మండలంలోని అయిటిపాముల గ్రామంలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. అయిటిపాముల గ్రామానికి చెందిన దానబోయిన నర్సమ్మ అనారోగ్యం కారణంగా ఈ నెల 21న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉంటున్న తన పెద్ద కుమారుడు వెంకటేశ్ వద్దకు వెళ్లింది. తిరిగి ఈ నెల 25న సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటం గమనించింది. లోనికి వెళ్లి చూసేసరికి బీరువాలో దాచిన రూ.2లక్షలు, రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, 26 తులాల వెండి పట్టా గొలుసులు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా ఈ నెల 23న అర్ధరాత్రి నర్సమ్మ సమీపంలోనే మరో ఇంట్లో రెండు తులాల బంగారు ఆభరణాలు, రూ.20వేలు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

కోతుల భయంతో పైనుంచి దూకిన విద్యార్థిని

- తీవ్ర గాయాలు, ఆస్పత్రికి తరలింపు

బొమ్మలరామారం: కోతుల భయంతో ఓ విద్యార్థిని పాఠశాల భవనం పైనుంచి దూకింది. ఈ ఘటన బొమ్మలరామారం మండల కేంద్రంలో సోమవారం జరిగింది. వివరాలు.. బొమ్మలరామారం మండల కేంద్రానికి చెందిన భార్గవి స్థానికంగా ఉన్న మాతృశ్రీ హైస్కూల్‌లో 10వ తరగతి చదవుతోంది. రోజు మాదిగా సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన భార్గవి పాఠశాల మొదటి అంతస్తులో చదువుకుంటోంది. ఈ క్రమంలో ఒక్కసారిగా కోతుల గుంపు విద్యార్థులు పైకి వచ్చింది. దీంతో భయాందోళనకు గురైన భార్గవి పాఠశాల మొదటి అంతస్తు నుంచి కిందకు దూకింది. తీవ్ర గాయాలపాలైన భార్గవిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనను పాఠశాల యాజమాన్యం, విద్యార్థిని తల్లిదండ్రులు గోప్యంగా ఉంచుతున్నట్లు తెలిసింది. ఇదే విషయమై ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డిని సంప్రదించగా.. విద్యార్థిని పాఠశాల భవనం పైనుంచి దూకిన ఘటన తమ దృష్టికి రాలేదన్నారు.

హైవేపై కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు

కేతేపల్లి: మండలంలోని ఉప్పలపహాడ్ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి కారు బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు సోమవారం రాత్రి ఉప్పలపహాడ్ శివారులో హైవేపై జంక్షన్ వద్దకు చేరుకోగానే అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న జీవీకే 1033 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలం వద్దకు చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.


ఘటనా స్థలంలో బోల్తా పడిన కారు

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చోరీ

భువనగిరి రూరల్: మండలంలోని నమాత్‌పల్లి గ్రామంలో గల పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి హుండీ తాళం పగులగొట్టి నగదు అపహరించారు. సుమారు 2 నెలల హుండీ డబ్బులను దొంగిలించినట్లు సోమవారం ఆలయ చైర్మన్ అతికం లక్ష్మీనారాయణగౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ బి. సంతోష్ కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


అవిలయ్య (ఫైల్)

నాగారం: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందాడు. ఈ ఘటన నాగారం మండలంలోని మాచిరెడ్డిపల్లిలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మట్టగజం అవిలయ్య(48) వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి మోటారు ఆన్ చేయడానికి ప్రయత్నించగా విద్యుత్ వైరు కాళ్లకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతిచెందాడు. సాయంత్రమైనా అవిలయ్య ఇంటికి రాకపోవడంతో అతడి భార్య పొలం వద్దకు వెళ్లి చూసేసరికి అతడు విగతజీవిగా పడి ఉన్నాడు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నల్లగొండక్రైం: నల్లగొండలోని నార్కట్‌పల్లి–అద్దంకి బైపాస్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మృతిచెందాడు. రూరల్ ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం తాళ్లవీరప్పగూడేనికి చెందిన గుంజ శ్రీనివాస్ (45) బైక్‌పై హైదరాబాద్ నుంచి దామరచర్ల వైపు వెళ్తుండగా నల్లగొండ పట్టణం నార్కట్‌పల్లి–అద్దంకి బైపాస్‌లో గల సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం భవనం వద్ద లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు రోజుల వ్యవధిలో భార్యాభర్తలకు డాక్టరేట్


శ్యామల

మునుగోడు: మండలంలోని సింగారం గ్రామానికి చెందిన గుంటుక కుమారస్వామి ఉస్మానియా యూనవర్సిటీ నుంచి రెండు రోజుల క్రితం డాక్టరేట్ పొందగా.. అతడి భార్య శ్యామలకు కూడా సోమవారం డాక్టరేట్ లభించింది. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ధీరజ పర్యవేక్షణలో 'బాలికల చదువు.. సామాజిక, ఆర్థిక పరిస్థితుల ప్రభావం' అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ ప్రకటించారు. కాగా నిరుపేద కుటుంబానికి చెందిన భార్యాభర్తలు ఇద్దరూ రెండు రోజుల వ్యవధిలో డాక్టరేట్ సాధించడంతో సింగారం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

రామన్నపేట: మండలంలోని తుర్కపల్లి గ్రామ పరిధిలో మూసీ నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను రామన్నపేట పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు మూసీ నది వద్దకు చేరుకొని ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అన్నను హత్యచేసిన తమ్ముడు

- ఇల్లు మరమ్మతుల విషయమై గొడవపడి ఘాతుకం
- కత్తిపీటతో నరికి, తలపై బండరాయి మోది చంపిన నిందితుడు
- శాలిగౌరారం మండలం పెర్కకొండారంలో ఘటన


రాంబాబు మృతదేహాన్ని పరిశీలిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

శాలిగౌరారం: ఇల్లు మరమ్మతుల విషయంలో అన్నదమ్ముల మధ్య తలెత్తిన వివాదం హత్యకు దారితీసింది. గంజాయి మత్తులో విచక్షణ కోల్పోయిన తమ్ముడు సొంత అన్నను దారుణంగా హత్యచేశాడు. ఈ ఘటన శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. పెర్కకొండారం గ్రామానికి చెందిన చర్లపల్లి వెంకన్న, పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. వెంకన్న అనారోగ్యంతో పదేళ్ల క్రితం మృతిచెందాడు. పద్మ తనకున్న రెండున్నర ఎకరాల భూమిని కౌలుకు ఇచ్చి తన ఇద్దరు కుమారులు చర్లపల్లి రాంబాబు(28), నవీన్‌ను కూలీ పనులు చేస్తూ సాకుతోంది. నవీన్ మద్యంతో పాటు గంజాయి తాగుతూ నిత్యం మత్తులో ఉండేవాడు. రాంబాబు తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో వైద్యుల సూచన మేరకు మద్యం అలవాటును మానేశాడు. రాంబాబు ఇంటివద్దనే సెల్‌ఫోన్ రిపేరు దుకాణం ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఆటో నడుపుకుంటూ తల్లికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా గతేడాది అర ఎకరం భూమిని విక్రయించారు. ఆ భూమికి సంబంధించిన డబ్బులు ఇటీవల చేతికి రావడంతో అప్పులు తీర్చగా రూ.6 లక్షలు మిగిలాయి. దీంతో పద్మ, రాంబాబు, నవీన్ తమ పేరున రూ.2లక్షల చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేసుకున్నారు.


రాంబాబు (ఫైల్)

ఇల్లు రిపేరు చేద్దామని..

వారు ఉంటున్న మూడు గదులు రేకుల ఇంట్లో రోడ్డు వైపు గదిలో రాంబాబు సెల్‌ఫోన్ రిపేరు దుకాణం నడుపుకుంటున్నాడు. అందులోనే పద్మ ఉంటుంది. మిగిలిన రెండు గదులలో రాంబాబు, నవీన్ విడివిడిగా ఉంటున్నారు. పెళ్లి చేసుకునే ఆలోచనలో ఉన్న రాంబాబు ఇల్లు రిపేరు చేసేందుకని తన బాబాయి కొడుకు చర్లపల్లి నరేశ్ సమక్షంలో సోమవారం మేస్త్రీతో ఒప్పందం చేసుకున్నాడు. ఆ సమయంలో నవీన్ ఇంటి రిపేరుకు డబ్బులు ఇవ్వనని వాదించగా రాంబాబు ఒక్కడే ఇంటి రిపేరు ఖర్చు భరించేందుకు అంగీకరించాడు. అనంతరం రాంబాబు గ్రామంలో ఓ వివాహానికి హాజరయ్యాడు.

షర్ట్ మార్చుకునేందుకు వచ్చి..

వివాహంలో స్నేహితులతో కలిసి ఫొటో దిగే సమయంలో షర్ట్ మార్చుకొని వస్తానని రాంబాబు తన ఇంటికి వచ్చాడు. అప్పటికే ఇంట్లో గంజాయి మత్తులో ఉన్న నవీన్ అన్న రాంబాబుతో ఇంటి రిపేరు విషయమై గొడవ పడ్డాడు. ఈ గొడవ తీవ్ర ఘర్షణకు దారితీయడంతో రాంబాబు ఇంట్లో నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా నవీన్ కత్తిపీటతో రాంబాబుపై దాడిచేశాడు. ఈ క్రమంలో రాంబాబు తన చేతులు అడ్డుపెట్టగా కత్తిపీట తగలడంతో చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. తప్పించుకునే క్రమంలో రాంబాబు కిందపడిపోగా.. నవీన్ కత్తిపీటతో దాడి చేయడంతో రాంబాబు మెడ, తలభాగంపై గాయాలయ్యాయి. గంజాయి మత్తులో విచక్షణ కోల్పోయిన నవీన్ బండరాయితో రాంబాబు తలపై మోదడంతో రాంబాబు అక్కడిక్కడే మృతిచెందాడు. నవీన్ గ్రామస్తులు పట్టుకొని చితకబాదుతుండగా అతడు పరారయ్యాడు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రత్యక్ష సాక్షులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. డీఎస్పీ వెంట శాలిగౌరారం ఇన్‌చార్జి సీఐ రాజశేఖర్, ఎస్ఐ ఐలయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు. మృతుడి తల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తోటకూర సాగు.. దిగుబడి అధికం

- పెద్దవూర ఉద్యానవన శాఖ అధికారి రవినాయక్


బి.రవినాయక్, ఉద్యానవన శాఖ అధికారి, పెద్దవూర


తుంగతుర్తిలో సాగవుతున్న తోటకూర

పాడి పంట

పెద్దవూర: పోషకాలు మెండుగా ఉండే ఆకు కూరలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. అందులో తోటకూరకు ప్రత్యేక స్థానం ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు తోటకూరను సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. తోటకూర సాగు విధానం, విత్తనం ఎంపిక, విత్తే విధానం, కోతల వివరాలను మండల ఉద్యానవన శాఖ అధికారి బి.రవినాయక్ వెల్లడించారు.

విత్తన రకాలు

- తోటకూరల్లో ఆర్ఎస్, ఏ–1, కో–2, పూసా చోటీ చౌలై, పూసాకీర్తి, పూసాకిరణ్, పూసాలాల్, ఔలై, ఆర్కసుగుణ, ఆర్కఅరుణ(ఎర్ర తోటకూర) తదితర చాలా రకాలు అందుబాటులో ఉన్నాయి.
- 25 రోజులకు మార్కెట్‌కు చేరుకునే అవకాశమున్న సిరి రకాన్ని ఎంపిక చేసుకోవడం ఉత్తమం.

సస్యరక్షణ చర్యలు

- విత్తనం నాటిన ఒకటి, రెండు రోజుల్లో ఒకటిన్నర లీటర్ల డ్యూయల్ మందును 250 లీటర్ల నీటిలో కలిపి నేలపై పిచికారీ చేయాలి. ఇలా చేస్తే కలుపును నివారించవచ్చు.
- ఆఖరు దుక్కిలో పశువుల ఎరువుతో పాటు ఎకరాకు 30కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 12 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేసి కలియదున్నాలి.
- కత్తిరింపుల ద్వారా ఆకు కోసుకునే రకాలకు 30 కిలోల నత్రజనిని మూడు భాగాలుగా చేసి కత్తిరింపు తర్వాత ఒకభాగం వేసి నీరు పెట్టాలి.
- తోటకూర ఆకులకు తెల్లమచ్చ తెగులు, ఆకులను తినే గొంగళి పురుగు బెడద ఎక్కువగా ఉంటుంది.
- ఆకు పైభాగాన పసుపు రంగు మచ్చలు ఏర్పడి, క్రమేణ పండుబారి ఎండిపోతాయి.
- తెల్లమచ్చల నివారణకు లీటర్ నీటికి 3 గ్రాముల కాఫర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2.5 గ్రాముల మాంకోజెబ్ కలిపి పిచికారీ చేస్తే తెగులును నివారించవచ్చు.
- గొంగళి పురుగు నివారణకు లీటరు నీటికి 2 మిల్లీ లీటర్ల మలాథిన్‌ను కలిపి పిచికారీ చేయాలి.
- ఆకుకూరల పంటలకు సాధ్యమైనంత వరకు వేప సంబంధిత మందులతోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.
- తప్పని పరిస్థితుల్లో తక్కువ విష పూరితమైన మందులను వినియోగించాలి.
- మందు చల్లేముందు ఆకులను కోసుకోవాలి. మందు చల్లాక వారం రోజుల వరకు ఆకులు కోయరాదు. ఈ చర్యలు చేపడితే తోటకూర లాభాల పంట అవుతుంది.

విత్తనం నాటే విధానం

- తోటకూర సాగుకు ఇసుకతో కూడిన గరప నేలలు అనుకూలం
- నీరు నిలిచే బంకమట్టి నేలలు పనికిరావు.
- నేలను నాలుగైదు సార్లు బాగా దున్నాలి. ఆఖరు దుక్కిలో ఎకరాకు ఆరు టన్నుల పశువుల ఎరువు వేసి కలియ దున్ని మడులు చదును చేసుకోవాలి.
- విత్తనాలను ఇసుకలో కలుపుకుని మడుల్లో చల్లుకోవాలి.
- విత్తనాన్ని నేరుగా చల్లకుండా నాఱ పెంచి కూడా నాటుకోవచ్చు.
- ఎకరానికి రెండు కిలోల విత్తనం అవసరం అవుతుంది. నారు పెంచటానికి విత్తనాలు సరిపోతాయి.